

హింసించాలనే ఆలోచన దుర్మార్గం

కారణాలేవైనా ఒక మనిషిని మరో మనిషి హింసించాలనే ఆలోచన దుర్మార్గమైంది. ప్రజాస్వామిక సమాజంలో వైద్యరంగం ప్రాథమికమైన సేవారంగం. ఆ రంగంలో సేవలందిస్తున్న వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందికి సంపూర్ణమైన రక్షణను కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉంది. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్య ఘటన అందరినీ కలచివేసింది. ఈ ఘటనపై మొత్తం మానవ సమాజం స్పందించడం మనోధైర్యాన్నిచ్చింది.

– డాక్టర్ కె.వసుధా భార్గవి, గైనకాలజిస్ట్, అంగర



భద్రత, భరోసా కల్పించాలి



మహిళా వైద్యులు, మహిళా వైద్య సిబ్బంది భద్రతకు ప్రభుత్వాలు భరోసా కల్పించాలి. వైద్యులపై దాడులు అరికట్టేందుకు చట్టాలను కఠినతరం చేయాలి. కోల్‌కతా సంఘటనలో నిందితులను కఠినంగా శిక్షించి తప్పు చేయడానికి భయం కలిగించాలి. ఎంతటి వ్యాధితో బాధపడుతున్న రోగులకైనా ధైర్యం కల్పించి చికిత్స అందించే వైద్యులకే రక్షణ లేకుంటే సమాజం మనుగడ కష్టమవుతుంది.

– కట్టా సరితాలక్ష్మి, హోమియో వైద్యురాలు, ద్రాక్షారామ

పల్లెల్లో క్రీడా ప్రగతి

- విశేషంగా రాణిస్తున్న క్రీడాకారులు
- వివిధ స్థాయిల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు
- మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో మెరిసిన క్రీడా స్ఫూర్తి
- 29న జాతీయ క్రీడా దినోత్సవం

కపిలేశ్వరపురం: ఆధునిక కాలంలో మనిషి మానసిక, శారీరక రుగ్మతలకు లోనవుతున్నాడు. వీటి నుంచి బయట పడేందుకు క్రీడలు చక్కటి మార్గంగా చెప్పవచ్చు. ఆటలు ఆడడం వల్ల శారీరక ధృడత్వంతోపాటు మానసికోల్లాసం లభిస్తుంది. ఒక పక్క తరగతి గదుల్లో పాఠాలు వింటూనే క్రీడా మైదానాల్లో ఆటల్లో మెరుస్తున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో విద్యార్థులతో పాటు గ్రామీణ, పట్టణాల్లోని 11 ఏళ్ల వయస్సు పై బడిన వారిని క్రీడల్లో పోత్సహిస్తూ ‘ఆడుదాం ఆంధ్రా’ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈనెల 29న క్రీడా దినోత్సవం సందర్భంగా రామచంద్రపురం, మండపేట నియోజవర్గాల్లోని క్రీడా ప్రగతిపై ఈ కథనం..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో క్రీడలకు మహర్దశ..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2023–28 క్రీడా పాలసీ ద్వారా ‘ఆడుదాం ఆంధ్రా’ పేరుతో నాలుగు దశల్లో క్రీడల సంబరాన్ని నిర్వహించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి 3 తేదీల్లో అమలాపురంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీల్లో షటిల్ బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో మండపేట నియోజకవర్గం జట్టు, మహిళా విభాగంలో రామచంద్రపురం నియోజకవర్గం జట్లు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. క్రికెట్ పురుషుల విభాగంలో రామచంద్రపురం నియోజకవర్గం ప్రథమ, మండపేట జట్టు తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. కబడ్డీ మహిళల విభాగంలో రామచంద్రపురం నియోజకవర్గం జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఖోఖో పోటీల్లో మండపేట నియోజకవర్గానికి పురుషులు విభాగంలో ద్వితీయ, మహిళల విభాగంలో తృతీయ స్థానాలు దక్కాయి. విజేతలకు జేసీ నుపూర్ అజయ్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

ఏడాది కాలంలో రెండు నియోజకవర్గాల్లో క్రీడాకారుల ప్రతిభ ఇలా

- 2023 సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 7 వరకూ దక్షిణాఫ్రికాలో నిర్వహించిన మెన్ అండ్ విమెన్ 5వ అంతర్జాతీయ టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ పోటీల్లో జర్మనీపై విజయం సాధించిన భారత జట్టులో మండపేటకు చెందిన క్రీడాకారులు వినయ్, రామారావు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలను అందుకున్నారు.
- 2023 అక్టోబర్‌లో రావులపాలెంలో జిల్లా రెడ్ రిబ్బన్ క్లబ్ నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో మండపేట డిగ్రీ కళాశాల విద్యార్థులు పలు క్రీడల్లో ప్రతిభ కనబర్చారు.
- 2023 నవంబర్ 24 నుంచి 26వ తేదీ వరకూ రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లా బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ 2023 పోటీలను నిర్వహించారు. రాష్ట్రంలోని 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.
- 2023 నవంబర్ 9 నుంచి 12 వరకూ తిరుపతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.వినయ్‌కుమార్, కె.సతీష్‌కుమార్, సుందరపల్లి సంధ్య, నీతిపూడి లక్ష్మీప్రియ, మాతా కావేరి ప్రతిభ కనబర్చారు.
- 2023 డిసెంబర్ 17న రామచంద్రపురంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన అంతర్‌జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌లో 13 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.
- భువనేశ్వర్‌లోని కిట్ యూనివర్సిటీలో నిర్వహించనున్న 73వ జాతీయ స్థాయి జూనియర్ మహిళల బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన 12 మందికి ఈ ఏడాది జనవరి 18 నుంచి ఫిబ్రవరి రెండు వరకూ రామచంద్రపురంలో శిక్షణ ఇచ్చారు.
- రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను ఎంపిక చేసే పోటీలను ఈ నెల పదో తేదీన మండపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 110 మంది హాజరయ్యారు. వారిలో ఎనిమిది మందిని ఎంపికవగా మండపేటకు చెందిన చైతన్య వీరంజై ఒకరు ఉన్నారు.



2023 నవంబర్‌లో రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన కపిలేశ్వరపురం హైస్కూల్ విద్యార్థులు (ఫైల్)

- కాకినాడ బ్రహ్మ సమాజం ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో నిర్వహించిన బ్రహ్మధ్యాన వక్తృత్వ పోటీల్లో రామచంద్రపురం మండలం వెలంపాలెంనకు చెందిన తలాటం సూర్యభవిత ప్రథమ స్థానాన్ని సాధించింది.
- 2023 అక్టోబర్ 3న కాజులూరు మండలం గొల్లపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికలు జరిగాయి.
- 2023 నవంబర్ 28–డిసెంబర్ 5న బెంగళూరులో యోనెక్స్–సన్‌రైజ్ ఆర్ ఇండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్–2023లో రామచంద్రపురం మోడరన్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థి బోను అభిషేక్ డబుల్స్ కేటగిరిలో రన్నర్‌గా నిలచాడు.
- 2023 అక్టోబర్‌లో చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగిన అండర్–19 బాస్కెట్‌బాల్ పోటీల్లో రామచంద్రపురం పట్టణం కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయోన్నత పాఠశాల విద్యార్థులు జి.విజయసీతారామ్, జి.పృథ్వీరాజ్‌కుమార్ భాగస్వామ్యంతో జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది.
- రాష్ట్ర స్థాయి హైజంప్ పోటీల్లో పాల్గొనేందుకు 2023 అక్టోబర్‌లో కాకినాడలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో కె.గంగవరం మండలం కుందూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కుందన లక్ష్మీప్రియ ఎంపికైంది.
- 2023 అక్టోబర్ 14–19లలో హైదరాబాద్‌లో జ్వాలా గుత్తా అకాడమీ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోనెక్స్ – సన్‌రైజ్ 35వ సబ్‌జూనియర్ నేషనల్ బ్యాడ్మింటన్–15 డబుల్స్ చాంపియన్ షిప్–2023 పోటీల్లో రామచంద్రపురానికి చెందిన విద్యార్థి బోను అభిషేక్ జాతీయ స్థాయిలో 3వ స్థానంలో నిలిచాడు.
- రామచంద్రపురం పట్టణంలో 2023 నవంబర్‌లో నిర్వహించిన ఇన్విటేషనల్ కెన్యూ రియో కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పట్టణానికి చెందిన కవలలైన దామిశెట్టి అక్షయలక్ష్మి, అక్షరలక్ష్మి గోల్డ్ మెడల్ సాధించారు.
- ఈ నెల 12న విజయవాడలో సెల్ఫ్ డిఫెన్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ రాష్ట్ర కుంగ్‌ఫూ, కరాటే పోటీలో మండపేటకు చెందిన నవ్య, నర్విక్‌రామ్ యశ్వంత్, సిద్ధు వివిధ స్థాయిల్లో ప్రతిభ కనబర్చారు.

సేవామూర్తి మదర్ థెరిసా



అంగరలో థెరిసాకు నివాళులు అర్పిస్తున్న సంఘం నాయకులు



మండపేటలో మదర్ థెరిసా విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వార్డు ప్రజలు



రాయవరంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఫణికృష్ణారెడ్డి, ఏఎస్సై వెంకటేశ్వరరావు, యూత్ సభ్యులు

కపిలేశ్వరపురం: సేవా మూర్తి మదర్ థెరిసా జయంతిని సోమవారం మండలం గ్రామాల్లో నిర్వహించారు. అంగరలోని థియేటర్ సెంటర్, పీహెచ్‌సీ ఆవరణల్లోని థెరిసా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. థెరిసా సేవా సంఘం నాయకులు మేడేపల్లి వీరాస్వామి, మత్సా గంగరాజు, చీకట్ల శ్రీను, మేడేపల్లి కనకరామకృష్ణ, ఆచంట చిన్నా, పైడి రమణ, యానాల సుబ్బారావు మాట్లాడుతూ మానవ విలువలు మాయమైపోతున్న ఈ రోజుల్లో మదర్ థెరిసా జీవితం ఆదర్శప్రాయం కావాలన్నారు.

మండపేట: పట్టణంలో మదర్ థెరిసా నిర్వహించారు. 8వ వార్డులో ఉన్న మదర్ థెరిసా విగ్రహానికి పట్టణానికి చెందిన పెందుర్తి ప్రదీప్‌కుమార్, పైడిమళ్ల సతీష్, ముమ్మిడి వరప్రు నారాయణ తదితరులు పూలమాలలు వేసి నివాళుల అర్పించారు.

రాయవరం: మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం మదర్‌థెరిసా జీవితమని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక మదర్‌థెరిసా యూత్ అధ్యక్షుడు చంద్రమళ్ల సంజయ్‌రాజు ఆధ్వర్యంలో సోమవారం మదర్‌థెరిస్సా 114వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, తూర్పుగోదావరి వలంటరీ బ్లడ్‌బ్యాంక్ ఛైర్మన్ వెలగల ఫణికృష్ణారెడ్డి, ఏఎస్సై వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. అనంతరం ఫణికృష్ణారెడ్డి, మదర్‌థెరిసా యూత్ సౌజన్యంతో 80 మంది వృద్ధులు, దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేశారు. తొలుతగా మదర్‌థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు లంక చందు, మందపల్లి కొండలరావు, మదర్‌థెరిసా యూత్ ఉపాధ్యక్షుడు దువ్వా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కందుకూరి గంగరాజు, సభ్యులు పలివెల సురేష్, సీహెచ్.రాజు, ముమ్మిడివరపు సూరి, గాడా మసేను తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని చెల్లూరు దళితపేటలో మదర్‌థెరిసా జయంతి వేడుకలు నిర్వహించారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలి



కొత్తపేట వీహెచ్‌పీ సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

కొత్తపేట: హిందువులు అందరూ ఐకమత్యంగా నిలిచి హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. వీహెచ్‌పీ స్థాపన జరిగి ఈ కృష్ణాష్టమికి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా వీహెచ్‌పీ షష్ట్యాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక గ్రామ దేవత బంగారమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వీహెచ్‌పీ జిల్లా మందిర అర్చక ప్రముఖ్ కోటిపల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన సభకు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించగా రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అక్కిరెడ్డి మాట్లాడుతూ హిందువులు తమ కులాన్ని ఇంటికే పరిమితం చేసుకుని బయట మాత్రం హిందువులం, బంధువులుగా మెలగాలన్నారు. ఐకమత్యంగా హిందూ ధర్మాన్ని ఆచరించాలని పిలుపునిచ్చారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి గోవిందు, కోశాధికారి నూలు శ్యామల, హిందూ సంపర్క ప్రముఖ్ జెల్లి సర్వలక్ష్మి, రిటైర్డ్ ఎంఈఓ ఏడిద సత్తిరాజు, బీజేపీ జిల్లా కన్వీనర్ ఇళ్ల సత్యనారాయణ, అర్చకుడు ఖండవిల్లి పాండురంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

508 కలశాలతో శ్రీకృష్ణునికి మహా అభిషేకం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభూ సుందరశ్రీనివాస్ దాస్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిపారు. అమలాపురం ఎంపీ హరీష్‌మాథుర్ ఈ వేడుకలకు హాజరయ్యారు. సుందర శ్రీనివాస్‌దాస్ శ్రీకృష్ణుడు లీలలను ప్రవచించారు. సాయంత్రం ఉట్టి సంబరం వేడుకలను జరిపారు. ఉదయం 4.30 గంటల నుంచి రాత్రి 12.30 గంటల వరకూ స్వామికి విశేష పూజలు జరిపారు. 508 కలశాలతో మహాభిషేకం, మహా భోగనివేదన, మహాహారతి వంటి విశేష క్రతువులు జరిపారు.

అనారోగ్య బాధితుడికి రూ.10 వేల సాయం

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు సోమవారం రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడు మండలం ప్రత్తిపాడు గ్రామానికి చెందిన బుర్రి రఘుబాబు వయస్సు 46 సంవత్సరాలు లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. లివర్ మార్పిడి ఆపరేషన్ చెయ్యాలి అని వైద్యులు తెలిపారు. ఆయన భార్య అంగన్వాడీ టీచర్. ఇద్దరు ఆడ పిల్లలు వైద్యం చేయించుకునే స్థోమత లేక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరగా మహేంద్రవాడలో సంస్థ సభ్యులు చేతుల మీదుగా రఘుబాబు భార్యకి రూ.10 వేలు నగదును ఆర్థిక సాయంగా అందజేసినట్లు సభ్యులు తెలిపారు.

రేపు డయల్ యువర్ డీఎం

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై 28వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు అమలాపురం డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి సోమవారం తెలిపారు. ప్రయాణికులు తమ సలహాలు, సూచనలను 95819 32678 సెల్ నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చన్నారు. అమలాపురం డిపో పరిధిలోని ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా..

- వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు
- గ్రామాల్లో ఉట్టికొట్టే ఉత్సవం

రాయవరం: గోకుల కృష్ణా..గోపాల కృష్ణా అంటూ అంటూ మండలంలో ప్రజలు శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు వైష్ణవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు.

వాసుదేవా యాదవ సంఘం ఆధ్వర్యంలో:..

స్థానిక వాసుదేవా యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక మందిరాన్ని ఏర్పాటు చేసి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు శ్రీకృష్ణుడి విగ్రహానికి పూజాధికాలు చేసారు. యాకల వెంకటరామకృష్ణారావు దంపతులు పీటలపై కూర్చుని పూజాధికాలు నిర్వహించారు. ఉత్సాహంగా యువకులు, చిన్నారులు ఉట్టికొట్టే వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు యాదవ సంఘం ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో యాదవ సంఘం నేతలు పైల తిరుమలరావు, బీసప్పు శ్రీనివాసరావు, గడిదేశి చంద్రశేఖర్, అల్లు వెంకన్నబాబు, బీసప్పు వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు. వెదురుపాకలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గీతామందిరంలో నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వంద మంది భక్తులు గీతాపారాయణం చేశారు. సాయంత్రం ఉత్సాహంగా ఉట్టికొట్టారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు ఆలయాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి ఘనంగా నిర్వహించారు. ద్రాక్షారామలోని ఓం శాంతి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బ్రహ్మకుమారీలు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ద్రాక్షారామ గీతా మందిరంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వెలంపాలెం లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఉట్టి కొట్టే కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు.

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీ కృష్ణ జన్మాష్టమి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో సందడి చేశారు.

మండపేట: పట్టణంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. బీసీ నాయకులు కోన సత్యనారాయణ ఉషశ్రీ దంపతుల ఆధ్వర్యంలో టౌన్‌హాల్ ఎదురుగా ఉన్న ఉషా టవర్ వద్ద సోమవారం రాత్రి వేడుకగా నిర్వహించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి వేడుకలను ప్రారంభించారు. యువకులు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాజులూరు: మండల గ్రామాల్లో సోమవారం శ్రీకృష్ణ భగవానుని జన్మదినమైన కృష్ణాష్టమి వేడుకలు భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. తణుకువాడ, గొల్లపాలెం, కాజులూరు, దుగ్గుదుర్రు, పెదలంక తదితర గ్రామాల్లోని శ్రీకృష్ణుని ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వేకువజాము నుంచి భక్తులు ఆలయాలను దర్శించుకుని స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి గీతాపారాయణ పఠించారు. పలు చోట్ల చిన్నారులు బాలకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఉట్టుకొట్టు ఉత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. పలువురు వక్తలు కృష్ణాష్టమి ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు.

కపిలేశ్వరపురం: జగత్‌గురువు శ్రీకృష్ణుడంటే అందరికీ ఇష్టమే. యుద్ధక్షేత్రాన వ్యూహకర్తగా, కుటుంబ పాలనలో అనురాగాల మూటగా నిత్యనవ్వుల వాడు శ్రీకృష్ణుడు. శ్రీకృష్ణాష్టమి పర్వదినాన పాడి పంటల పల్లెలు తేజోమయమై విలసిల్లాయి. కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాల్లో సోమవారం శ్రీకృష్ణాష్టమిని వైభవంగా నిర్వహించారు. వైష్ణవాలయాలను భక్తులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. సెలవుదినం కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో అలంకరించి మురిసిపోయారు. అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, కాలేరు, నల్లూరు, వల్లూరు గ్రామాల్లోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో స్వామిని విశేషంగా అలంకరించారు. ఉట్టికొట్టు ఉత్సవాలను నిర్వహించారు.

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన బియ్యంపేటలోని గోశాలలో స్థానిక చిన్నారులు కృష్ణాష్టమి పురస్కరించుకుని సోమవారం సందడి చేశారు. శ్రీకృష్ణుడు, గోపికలతో వేషధారణలో వచ్చి గోవులను పూజించారు.



వెదురుపాకలో భక్తుల పూజలందుకున్న శ్రీకృష్ణుడు



ద్రాక్షారామ గీతామందిరంలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు



కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే వేగుళ్ల



గొల్లపాలెంలో కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరిస్తున్న చిన్నారులు



ద్రాక్షారామ భీమేశ్వరాలయ గోశాలలో సందడి చేస్తున్న చిన్నారులు

క్లుప్తంగా

నిండు శోకంతో సంతాప దినాలు



ద్రాక్షారామలో ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో అర్బయీన్ 40 రోజుల సంతాప దినాలు నిండు శోకంతో ముగిశాయి. అంజుమన్ సంఘాలు, పంజా ధర్మకర్తల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముస్లింలు కర్బలా పుణ్యభూమిలో వందల ఏళ్ల క్రితం మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమాం హుస్సేన్, ఆయన పరివారం, వీర మరణం పొందడం గుర్తు చేసుకుంటూ బోరున విలపించారు. ఆదివారం రాత్రి 40వ రోజు మృత కళేబరాల ఖననం స్మరించుకుంటూ విషాద గేయాలు ఆలపించారు. సోమవారం ముంబై నుంచి విచ్చేసిన మత గురువు మౌలానా అఖిల్ తురాబి, మత గురువు మౌలానా మీర్జా అస్కరి హుస్సేన్‌లు మజ్లిస్‌ల రూపంలో ప్రవక్తలు అనుభవించిన కష్టాలను వివరిస్తున్నప్పుడు భక్తులు ముక్త కంఠంతో విలపించారు. గుర్రాలపై హమాలీలు ఊరేగుతూ మాతం నిర్వహించారు.

అంగరలో అపారిశుధ్యం



ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు

కపిలేశ్వరపురం: మండలంలోని మేజర్ పంచాయతీ అంగర గ్రామంలో పంచాయతీ అధికారులు, సర్పంచు తదితరుల నిర్లక్ష్యం కారణంగా అపారిశుద్యం నెలకొందని గ్రామ ఉప సర్పంచ్ యర్రంశెట్టి వీరన్నబాబు సోమవారం ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల వీధుల్లో చెత్తను తరలించడమూ, డ్రైన్లు శుభ్రపర్చడంలో సకాలంలో జరగడంలేదన్నారు. ఫలితంగా గ్రామంలో జ్వరపీడితులు పెరుగుతున్నారన్నారు. ఈ మేరకు తాను ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా పట్టించుకోని పక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని వీరన్నబాబు అన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో సమస్యలు దూరం



గొల్లపాలెం యాదవ యువకులతో కలసి ఉట్టుకొట్టు ఉత్సవంలో పాల్గొన్న మంత్రి సుభాష్

కాజులూరు: ఆధ్యాత్మిక చింతనతోనే మనిషి సమస్యలకు దూరంగా ఉంటూ మానసిక ప్రశాంతతను పొందగలుగుతాడని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండలంలోని గొల్లపాలెంలో సోమవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణభగవానుని జన్మదినమైన కృష్ణాష్టమి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. కార్యక్రమాలలో మంత్రి సుభాష్ పాల్గొని వేణు గోపాలస్వామి ఆలయంలోనూ, కృష్ణుడి గుడిలోనూ స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద వీధిలో ఉట్టు కొట్టే ఉత్సవంలో పాల్గొని యాదవ యువకులతో కలసి ఉట్టుకొట్టారు. మంత్రి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ భగవంతునిపై భక్తిశ్రద్ధలు కలిగి ఉండాలన్నారు.

పంట తెగుళ్లపై రైతులు శ్రద్ధ వహించాలి

కాజులూరు: పంట తెగుళ్లపై రైతులు తొలి దశ నుంచి తగిన శ్రద్ధ వహించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని బందనపూడి, గొల్లపాలెంలలో వ్యవసాయాధికారి పర్యటించారు. బందనపూడిలో ఏఓ అశోక్ మాట్లాడుతూ వరిసాగులో పంట తొలి దశ నుంచే మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆశించిన లాభాలు పొందవచ్చన్నారు. ప్రస్తుత తొలకరిలో మండల గ్రామాల్లో రైతులు నారుతీసి నాట్లు వేసే విధానానికి బదులు ఎక్కువగా వెదచల్లిక విధానం అవలంభిస్తున్నారని ఈ విధానం మెలైనదే అయినప్పటికీ కలుపు తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. రైతులు ముందు నుంచి తగిన మందులు వినియోగించి కలుపును సమర్థవంతంగా అరికడితే వెదచల్లికలో మేలైన దిగుబడులు సాధించవచ్చన్నారు. విత్తనాలు చల్లేముందు విత్తనశుద్ధి చేసే విధానంపైనా, కలుపు నివారణకు దశల వారీగా పిచికారీ చేయవలసిన మందులపైనా రైతులకు తగు సూచనలు అందించారు.

రోగికి రూ.20 వేల సాయం

మామిడికుదురు: మగటపల్లి గ్రామానికి చెందిన గోవిందవర్ఘుల శ్రీనివాసరావు భార్య హృద్రోగ సమస్యతో బాధపడుతున్నారు. ఆమె వైద్య సేవల కోసం నామన ఫౌండేషన్ ద్వారా సోమవారం రూ.20 వేల ఆర్థిక సహాయం అందించారు. జెడ్పీ మాజీ చైర్మన్, ఫౌండేషన్ చైర్మన్ నామన రాంబాబు, డాక్టర్ నామన వినోద్ ఈ సహాయాన్ని శ్రీనివాసరావుకు అందజేశారు. ఉంగ్రు శ్రీరామారావు, కుంపట్ల బాబ్జి, రమేష్, మనేంద్ర పాల్గొన్నారు.

విఘ్నేశ్వరునికి పూజలు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయం సోమవారం భక్తులతో పోటెత్తింది. స్వామికి ఆలయ ప్రధానార్చకులు సూర్యనారాయణ మూర్తి లఘున్యాస, ఏకదశ అభిషేకాలు, లక్ష్మీ గణపతిహోమం, పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు జరిపారు.